'హైదరాబాద్‌లో గులాబీ జెండా ఎగరవేస్తా'


కేటీఆర్‌కు బొకే అందజేస్తున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: హైదరాబాద్ పార్లమెంట్‌లో మజ్లిస్, బీజేపీలను చిత్తుగా ఓడించి గులాబీ జెండా ఎగరవేస్తానని హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. పదేళ్ల మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం పాతబస్తీ కోసం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం, ప్రగతితోనే విజయం సాధిస్తానన్నారు. మంగళవారం మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి టికెట్ కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..20 ఏళ్లకు పైగా మజ్లిస్ పార్టీ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ముస్లింలకు అసత్య హామీలు ఇచ్చి ఏ హామీలు నెరవేర్చలేదన్నారు. బీజేపీ, మజ్లిస్‌లకు ప్రజలే గుణపాఠం చెప్పాలన్నారు. మతం పేరు చెప్పి ఓట్లు అడిగే బీజేపీ, మజ్లిస్ పార్టీలు ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడటం ఖాయమన్నారు. తనను గెలిపిస్తే హైదరాబాద్ పార్లమెంట్‌ను భారతదేశంలోనే నెంబర్:1గా తీర్చిదిద్దుతానన్నారు. గోషామహల్ నియోజకవర్గంతో పాటు పాతబస్తీ నలుమూలలా ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారని గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

హ్యాండ్ రైటింగ్ బాగుంటేనే ఆశించిన ఫలితాలు



చార్మినార్: పోటీ పరీక్షల్లో మనం రాసే హ్యాండ్ రైటింగ్ బాగున్నప్పుడే ఆశించిన ఫలితాలుంటాయని నారాయణ విద్యా సంస్థల అధినేత షరణి అన్నారు. అంతర్రాష్ట్ర హ్యాండ్ రైటింగ్ పోటీల్లో చార్మినార్ నారాయణ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని రుకియా మజహర్, ఉపాధ్యాయులు నూర్జెస్ ఫాతిమా, మనీషా అక్తర్ తదితరులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మనం రాసే రాతలు ఇతరులకు అర్థం అయినప్పుడే మనం ఏం చెప్పాలనుకున్నామో తెలుస్తుందన్నారు. హైస్కూల్ విద్యార్థుల కోసం అంతర్రాష్ట్ర హ్యాండ్ రైటింగ్ పోటీలు నిర్వహించగా.. 6,752 మంది విద్యార్థులు పాల్గొన్నారని, 5 దశల్లో జరిగిన పోటీల్లో ఐదుగురు విద్యార్థులు మాత్రమే విజేతలుగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం బాలపరమేశ్వర్, కో ఆర్డినేటర్స్, ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం టోలిచౌకి మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన కార్వాన్ నియోజకవర్గానికి చెందిన మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను తన దృష్టికి తేవడంలో మజ్లిస్ ఏరియా కమిటీలదే కీలక పాత్ర అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండని ఏరియా కమిటీ ప్రతినిధులకు పార్టీలో స్థానం ఉండదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా వేసవి కాలంలో తాగునీటి సరఫరా సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయని ఆయన అన్నారు. ఏరియా కమిటీ ప్రతినిధులు తమ తమ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ జబ్బార్, ఆరీఫుద్దీన్ తదితరులున్నారు.

ఈసారి హైదరాబాద్ మాదే: మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత

చార్మినార్: ఈసారి హైదరాబాద్ పార్లమెంట్‌ను కైవసం చేసుకుని దేశ ప్రధాని నరేంద్ర మోదీకి కానుకగా అందజేయనున్నామని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ఓటర్లు బీజేపీకి ఓటు వేసి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా పత్తర్‌గట్టి డివిజన్ అధ్యక్షుడు కాట ఆదిత్య ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మీరాలంమండిలో సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ.. దశాబ్దాలుగా హైదరాబాద్‌లో మజ్లిస్ పార్టీ అధికారం చెలాయిస్తున్నప్పటికీ..ఎక్కడా అభివృద్ధి దాఖలాలు లేవన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలు వేరు..ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలు వేరన్నారు. అబ్కీ బార్..చార్ సౌ పార్..అనే నినాదంతో ముందుకు వెళ్తూ హైదరాబాద్‌ను కైవసం చేసుకోవడానికి తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు నిరంతరం పని చేయనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు మానిక్ ప్రభు, ప్రధాన కార్యదర్శులు కృష్ణాగుప్తా, శ్రీధర్‌యాదవ్, బీజేపీ గోల్కొండ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'పాండవోద్యోగమ్'


గుమ్మడి గోపాలకృష్ణను సన్మానిస్తున్న మధుసుదనాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రసరంజని 31వ వార్షికోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న నాటకోత్సవాలు నాటక ప్రియులను అలరిస్తున్నాయి. 2వ రోజు అయిన మంగళవారం పద్మశ్రీ పురస్కార గ్రహీత గుమ్మడి గోపాలకృష్ణ దర్శకత్వంలో ప్రదర్శించిన పాండవోద్యోగమ్ నాటకాన్ని ప్రదర్శించారు. అనంతరం మాజీ స్పీకర్ ఎస్.మధుసుదనాచారి మాట్లాడుతూ..మూడు రోజుల పాటు నాటకోత్సవాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. కురుక్షేత్రం నాటి పరిస్థితులను నాటక రంగంలో సరికొత్త ప్రయోగంతో చేసిన ప్రదర్శన ఎంతో బాగుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు కేవీ రమణాచారి, కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, నాటక రచయిత దివాకరబాబు, రసరంజని కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణే లక్ష్యం

- ఇంకుడు గుంతలను ప్రోత్సహించేందుకు జీహెచ్ఎంసీ శ్రీకారం
- వారం రోజుల పాటు ఇంటింటి సర్వే
- 300 గజాల విస్తీర్ణంలో నిర్మించే ప్రతి భవనంలో ఇంకుడుగుంత ఉండేందుకు ప్రణాళికలు
- డివిజన్‌కు ఒక బృందం పనిచేసేలా చర్యలు


సర్కిల్-12 డీఎంసీ అధ్యక్షతన ఇంకుడు గుంతలపై సమీక్షా సమావేశం

నాంపల్లి: నీటి ఎద్దడి నివారణకు ఇంకుడు గుంతలను ప్రోత్సహించేందుకు జీహెచ్ఎంసీ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా వారం రోజుల పాటు ఇంటింటి సర్వే చేపడుతోంది. 300 గజాల విస్తీర్ణంలో నిర్మించే ప్రతి భవనంలో ఇంకుడు గుంత ఉండేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. నియోజవకర్గంలో డివిజన్‌కు ఒక బృందం పనిచేసేలా చర్యలు చేపట్టింది. ఇంకుడు గుంతలు ఎక్కడెక్కడ ఉన్నాయి? ప్రస్తుతం వాటి స్థితిగతులేమిటి? కొత్తగా ఎక్కడెక్కడ చేపట్టాలి అనే అంశాలను సర్వే ద్వారా వివరాలను సేకరించే పనిలో ఉంది. భూమి మీద పడిన ప్రతి చినుకు భూమిలోకి ఇంకిపోవాలనే సంకల్పంతో జీహెచ్ఎంసీ యంత్రాంగం పనిచేస్తోంది. ఈ మేరకు సర్కిల్-12 డీఎంసీ అధ్యక్షతన ఇంకుడు గుంతలపై సమీక్షా సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. అవసరం ఉన్న ప్రతి చోటా రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ (ఇంకుడు గుంతలు) తవ్వాలనే యోచనలో ఉన్నారు. ఈ ప్రక్రియ పూర్తిగా జూన్, జులై నాటికి పక్కాగా పూర్తయ్యేందుకు సమాయత్తం అవుతున్నారు. వర్షాకాలం రాక ముందే ఇంకుడు గుంతలు పూర్తి చేస్తే కురిసిన వర్షం మూసీ పాలు కాకుండా ఎక్కడి నీరు అక్కడే భూమిలో ఇంకిపోయే అవకాశం ఉందని, అదే సంకల్పంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని సంబంధిత జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.


ఓ ఇంట్లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత

పనులను త్వరలో ప్రారంభిస్తాం..

బెంగళూరు వంటి మహానగరాల్లో నీటి ఎద్దడి ఏర్పడింది. శరవేగంగా పెరిగిన నగరాల్లో ముందస్తు ప్రణాళికలు లేకపోవడమే నీటి ఎద్దడి ప్రధాన కారణం కావచ్చు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలో కూడా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో భాగంగానే ఇంటింటి సర్వే చేస్తున్నాం. ఎక్కడెక్కడ ఇంకుడు గుంతలు అవసరం ఉన్నాయో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాం. పాత వాటిని పునరుద్ధరించడమే కాకుండా కొత్త వాటిని ఏర్పాటు చేసే పనులను త్వరలోనే ప్రారంభిస్తాం.

– సీహెచ్.నాగేశ్వరరావు, డీఎంసీ

ఇంటింటి సర్వే షురూ...

- 300 గజాల విస్తీర్ణం కలిగిన ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఉండాలనే లక్ష్యంతో ఇంకుడు గుంతల సర్వే కార్యక్రమం జరుగుతోంది. ఆ దిశగా క్షేత్రస్థాయిలో బల్దియా సిబ్బంది సర్వే చేస్తున్నారు.
- డివిజన్‌కు ఒకరు చొప్పున ఏడు డివిజన్లలో ఇంటింటి సర్వే కొనసాగుతోంది. ఒక్కో టీమ్‌లో నలుగురు సభ్యులు ఉంటూ బస్తీలో తిరుగుతూ సర్వే వివరాలను సేకరిస్తున్నారు.
- అపార్ట్‌మెంట్లు, విల్లాలు, దాబాల్లో కూడా సర్వే చేస్తున్నారు. కమ్యూనిటీ హాళ్లు, ఆసుపత్రులు, పోలీసు స్టేషన్లను, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు ఇందేలా ప్రణాళికలు చేస్తున్నారు.
- ఈ సర్వే వారం రోజుల పాటు జరుగుతుంది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో కొనసాగుతుంది.
- స్వచ్ఛందంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలనుకునే వ్యక్తులు జీహెచ్ఎంసీ అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది.
- 300 గజాల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టాలను వ్యక్తులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. లేదంటే అనుమతులు ఇవ్వడం జరగదని అధికారులు పేర్కొంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కే.వి ఆసిఫ్‌నగర్, పురాణాపూల్ అండర్ గ్రౌండ్స్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని ఆసిఫ్‌నగర్ నాలా, పాత ఫీల్‌ఖానా, విజయలక్ష్మి అపార్ట్‌మెంట్, ఆసిఫ్‌నగర్, యాదవ్‌బస్తీ, జుమ్మేరాత్ బజార్, జించిచౌరా, సేవాదళ్, గోషాకట్ తదితర ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

తెలంగాణలో కాంగ్రెస్ విజయం ఖాయం

గోల్కొండ: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలోని మొత్తం 17 ఎంపీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవడం ఖాయమని ఆ పార్టీ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన తీరును తెలంగాణ ప్రజలంతా ముక్త కంఠంతో ప్రశంసిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలను ఒకొక్కటిగా అమలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌ను ప్రజలకు మరింత చేరువ చేశారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన అవినీతి కుంభకోణాలు ఒకొక్కటిగా వెలుగు చూస్తున్నాయని దీన్ని బట్టి అప్పటి ప్రభుత్వం, ఉన్నతాధికారులు తెలంగాణ ప్రజలను ఏ విధంగా దోచుకున్నారో అర్థం అవుతుందని తెలిపారు.

'నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలలో పోటీ చేస్తుంది'

గన్‌ఫౌండ్రీ: నవరంగ్ కాంగ్రెస్ పార్టీ రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్ తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్నా నిరుపేదల జీవితాలు ఏ మాత్రం మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అమాయకత్వాన్ని ఓట్లుగా మార్చుకొని ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కుతున్నారని మండిపడ్డారు. ప్రజలు తమ సమస్యలపై గళమెత్తాలని అప్పుడే జీవితాలలో మార్పు వస్తుందన్నారు. రాబోయే వారం రోజుల్లో తమ అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం నవరంగ్ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను ఆవిష్కరించారు.

ఇంకుడు గుంతలపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కార్యక్రమంలో రాచకొండ మల్లేష్, చల్లా శ్రీనివాస్‌రెడ్డి

అబిడ్స్: ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు తవ్వాలని జనని ఫౌండేషన్ అధ్యక్షుడు రాచకొండ మల్లేష్ పేర్కొన్నారు. ప్రపంచ నీటి దినోత్సవంలో భాగంగా మంగళవారం అబిడ్స్ కట్టెలమండిలోని ఆంధ్రా విద్యాలయ ఉన్నత పాఠశాలలో ఇంకుడు గుంతల ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా రాచకొండ మల్లేష్ మాట్లాడుతూ..ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తే నీటి సమస్యలు ఉండవన్నారు. ప్రధానోపాధ్యాయులు చల్లా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..విద్యార్థులకు మంచి నీటి అవసరాలు, ఇంకుడు గుంతల ప్రాముఖ్యతపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించామన్నారు. విద్యార్థులు తమ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలపై పక్కవారికి అవగాహన కల్పించి ఇంకుడు గుంతలను పెంపొందించాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు హేమ, మంజుల, ప్రమీళ, సునిత, జ్యోతి, కవిత, ప్రియా, కురుమయ్య పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి


ఇన్‌స్పెక్టర్ సైదులును సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు అన్నారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి ఇన్‌స్పెక్టర్ సైదులును మంగళవారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ చారిత్రక ప్రదేశం అని ఇంతటి ముఖ్యమైన ప్రదేశంలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేయడం తనకు దేవుడు ఇచ్చిన వరమన్నారు. గోల్కొండలో పీస్ అండ్ మైత్రి కమిటీ ఎంతో క్రియాశీలకంగా పని చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కమిటీ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి, శ్రీ మహంకాళీ ఆలయ పూజారి సురేష్‌చారి ఉన్నారు.

గోల్కొండ ఆసుపత్రిలో సదరం క్యాంప్



గోల్కొండ: అంగవైకల్య నిర్ధారణ కోసం సదరం క్యాంప్‌కు వచ్చే వారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోని తమ వద్దకు రావాలని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. మంగళవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో సదరం క్యాంప్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన క్యాంప్‌కు వచ్చిన వారితో మాట్లాడి వారి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారి టోకెన్‌లను తీసుకోని వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తమ వద్ద కేవలం ఆర్థోపెడిక్ పరీక్షలు మాత్రమే జరుగుతాయని ఫిజిషియన్ కూడా అంగవైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. సదరం క్యాంప్‌లో మొత్తం 33 మంది వచ్చారని ఆయన తెలిపారు. వీరిలో 21 మందికి ఆర్థోపెడిక్, 12 మందికి న్యూరో వైద్య పరీక్షలు నిర్వహించామని అన్నారు. ఒకరికి నిలోఫర్ ఆసుపత్రి, మరో నలుగురికి ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఆర్థోపెడిక్ వైద్య పరీక్షలు డాక్టర్ క్రాంతి నిర్వహించారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎంపీ రమణారెడ్డి


సీఎంకి జ్ఞాపికను అందజేస్తున్న ఎంపీ.రమణారెడ్డి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ అమరవీరుల స్మారకం అమరజ్యోతి రూపశిల్పి ఎంపీ రమణారెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేశారు. తెలంగాణ లలిత కళా అకాడమీని పునరుద్ధరించడం, రిజినల్ సెంటర్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం వంటి పలు సమస్యలపై వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

నోరూరించే హైలైన్ హలీం


వినియోగదారులకు హలీంను అందజేస్తున్న యజమాని సల్మాన్ సేట్

గన్‌ఫౌండ్రీ: రంజాన్ అనగానే అందరికీ గుర్తొచ్చేది హలీం. 42 ఏళ్లుగా కింగ్ కోఠి చౌరస్తాలోని హైలైన్ హలీం రెస్టారెంట్ మాంసాహార ప్రియులకు రుచికరమైన హలీం అందిస్తోంది. ఈ సందర్భంగా మంగళవారం రెస్టారెంట్ యజమాని సల్మాన్ సేట్ రెస్టారెంట్ ప్రత్యేకతలను 'సాక్షి'తో వెల్లడించారు. తమ రెస్టారెంట్‌లో వినియోగదారులకు రుచికరమైన హలీంతో పాటు పలు రకాల వంటకాలను అందిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మటన్, చికెన్, ఫిష్, పన్నీరు, మండి, కుర్బానీ మీటాలను వినియోగదారులకు అందుబాటులో ఉంచినట్లు తెలియజేశారు.

సిటీ కాలేజీలో హోలీ వేడుకలు



చార్మినార్: అఖిల భారత విద్యార్థి పరిషత్ కోఠి జిల్లా లోని స్థానిక సిటీ కళాశాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. కోఠి జిల్లా కన్వీనర్ సి. కల్యాణ్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరికి తెలియజేసే విధంగా ఈ రంగుల పండుగను నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరి జీవితం రంగులమయమైన ఆనంద జ్యోతిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు సజన్, నగర కార్యదర్శి రాహుల్, సౌశిక్, కళాశాల కార్యదర్శి జితేందర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మానవీయ కోణంలో వైద్య సేవలు


అంధ దంపతుల చిన్నారితో ఆసుపత్రి సిబ్బంది

గోల్కొండ: మానవీయ కోణంలో వైద్య సేవలు అందిస్తున్నామని భటర్‌ఫ్లై ఆసుపత్రి మెనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వసంత్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆసుపత్రిలో ఆయన చిన్నారికి అందించిన వైద్య సేవలను వివరించారు. ఉప్పర్‌పల్లిలో నివసించే దంపతుల్లో ఇద్దరు అంధులే. వీరికి ఐదు నెలల వయస్సు గల రుత్‌ప్రియా అనే కూతురు ఉంది. ఈ చిన్నారి నెల రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతుంది. స్థానికంగా చికిత్స చేసినా చిన్నారి కోలుకోలేదు. దీనస్థితిలో అంధ దంపతులు గత వారం చిన్నారిని భటర్‌ఫ్లై ఆసుపత్రికి తీసుకువచ్చారు. చిన్నారిని పరిశీలించిన డాక్టర్లు పాపకు అత్యవసర చర్యలు అందించి వారం రోజుల పాటు ఐసీయూలో ఉంచారు. ఆ పాపను మంగళవారం డిశ్చార్జ్ చేశారు.

కేలండర్ ఆవిష్కరణ



సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ 2024 కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్, ప్రధాన కార్యదర్శి మచాల రవీందర్ సమక్షంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రోగ నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకమైదని పేర్కొంటూ వారి సామర్థ్య నైపుణ్యాలను కొనియాడారు. అనంతరం ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్, అసోసియేషన్ సభ్యులందరికీ అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు హరినాథ్ మాట్లాడుతూ.. రాష్ట్రమంతటా ల్యాబ్ టెక్నీషియన్లపై తీవ్రమైన పని భారం ఉందని, అయినప్పటికీ అలా సమర్థవంతంగా ల్యాబ్ టెక్నీషియన్లు తమ తమ సేవలను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమేష్, ఉపాధ్యక్షులు పురుషోత్తం, ప్రవీణ్, బసప్ప, కార్యవర్గ సభ్యులు భాస్కర్, కౌసర్ ఉన్నిసా, ముజీబ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో సూపరింటెండెంట్ డా. రజనీరెడ్డి

దూద్‌బౌలి: రోగులతో పాటు అటెండర్స్‌కు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆసుపత్రి ఆవరణలో తాగునీటి ఆర్వో ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేట్లబురుజు ఆధునిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజనీ రెడ్డి అన్నారు. మంగళవారం ఆసుపత్రి ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ఇక్కడ రోగులకు ఆధునిక వైద్య సేవలు అందజేస్తున్నామన్నారు. రోగులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరి, పీహెచ్‌డీ డాక్టర్ అండాలు, ఆసుపత్రి ఆర్ఎంఓ సీపీ జైన్, అమృత లక్ష్మి పాల్గొన్నారు.

పేదలకు అండగా మియామిస్క్ మసీదు

- మూసీ వరదల్లో ప్రజలకు రక్షణ కల్పించిన మసీదు
- ఇతర రాష్ట్రాల విద్యార్థులకు వసతి
- వేడినీటి కొలనులో వైద్య చికిత్సలు


పురానాపూల్ మియామిస్క్ మసీదు


మసీదు ముఖద్వారం

జియాగూడ: పురానాపూల్ చౌరస్తాలో గోల్కొండ ఖిలా, చార్మినార్‌కు వెళ్లే ప్రధాన కూడలి పురానాపూల్ మియామిస్క్ మసీదుగా పేరు గడించింది. నిరుపేదలకు బాసటగా మూసీ వరదల్లో ప్రజలకు రక్షణగా, విద్యార్థులకు వసతి, నాటి నిజాం నవాబు వద్ద ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కిషన్ పర్షాద్‌కు వైద్యం అందించిన ఘనత ఈ మసీదుకు ఉంది. పురానాపూల్ మియామిస్క్ మసీదును 1678లో గోల్కొండ 6వ రాజు అబ్దుల్లా కుతుబ్‌షాకు అంతరంగిక కార్యదర్శిగా, నవాబు అంతపురానికి సైన్యాధికారిగా పనిచేసిన మిస్కిమియా నిర్మించాడు. హబ్సి తెగకు చెందిన అతడిని ప్రజలు బడే మాలిక్ అని గౌరవంగా పిలిచేవారు. 1680లో మిస్కిమియా చనిపోయినప్పుడు ఈ మసీదు ప్రాంగణంలోనే అతడి సమాధిని నిర్మించారు. ఈ మసీదుకు రెండు మిలార్లు ఉండడం ప్రత్యేకత.

నిర్మాణ శైలి...

మసీదు ప్రధాన ద్వారం పైనా స్తంభాలతో ఒక శాసనం లిఖించబడి ఉంది. మసీదు వెనుక భాగంలో మసాజ్, వేడి నీటితో కూడిన స్నానపు గదులు ఉండేవి. మధ్యభాగంలో ఫౌంటెయిన్‌తో కూడిన వజూఖానా ఇప్పటికి ఉంది. మసీదు మధ్యలో రెండు భారీ స్తంభాలు మొత్తం భవనాన్ని పట్టుకున్నట్లు కనిపిస్తాయి. సన్నని గ్రిల్స్‌తో గాజు తలుపులు మసీదు ముందు భాగంలో ఉన్నాయి. మసీదు కుడివైపున మయామిస్క్ సమాధి నేటికీ ఉంది. రాజుకు అంతరంగిక కార్యదర్శిగా నవాబు అంతపురానికి సైన్యాధికారిగా బాధ్యత వహించాడని మియామిస్క్ సమాధిపై ఉన్న శాసనంపై రాయబడి ఉంది. లోపలి భాగంలో చుట్టూ రాతి స్తంభాలు, ప్రధాన సమాధి ఎడమ వైపున అనేక చిన్న సమాధులు ఉన్నాయి.

ఎన్నో సేవలు..

మియామిస్క్ మసీదుకు వచ్చే నిరుపేదలకు రక్షణ, వ్యాధిగ్రస్థులకు చికిత్సలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థులకు వసతి గృహాలు నేటికి కొనసాగుతున్నాయి. నిజాం హయాంలో ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన కిషన్ పర్షాద్ సైతం తనకు వచ్చిన వ్యాధి తగ్గడానికి ఇక్కడ నెలరోజుల పాటు ఉండి చికిత్సలు పొందాడు. మూసీ వరదలకు నిరాశ్రయులైన ఎంతో మంది నిరుపేదలకు వసతి కల్పించిన మసీదు మియామిస్క్.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం..



నాటి నుంచి సేవలందిస్తున్న మియామిస్క్ మసీదు విద్య, వైద్య రంగాల్లో చేయూత నిస్తోంది. హైదరాబాద్ పట్టణాభివృద్ధి అథారిటీ సూచించిన హైదరాబాద్ వారసత్వ జాబితాలో ఇది కూడా ఉంది. రంజాన్‌కు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

– సమాద్ వార్సి, మసీదు అధ్యక్షుడు